సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



బోనాలు, బతుకమ్మలతో నిరసన

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు శుక్రవారం బతుకమ్మలు, బోనాలతో నిరసన తెలిపారు. - IIIలో



రెవెన్యూ డివిజన్ చేయాలి

ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. - IIIలో



రెగ్యులరైజ్ చేయాలి

రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష 15వ రోజుకు చేరింది. - IVలో

న్యూస్‌రీల్

సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ



పత్తిలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

మోటకొండూర్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్లే తెగుళ్లను నివారించవచ్చని ఏరువాక జిల్లా శాస్త్రవేత్త అనిల్‌కుమార్ సూచించారు. మోటకొండూరు మండల కేంద్రంలో పత్తి చేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. గులాబీ రంగు పురుగును గుర్తించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి వ్యాధికారక పురుగుల ఉధృతిని తెలుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మధుశేఖర్, మమత, చందన, ఖ్యాతి, మధువాణి, పూజిత, జెస్సిక, లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకులకు దీటుగా సేవలందించాలి



డీసీఓను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

బొమ్మలరామారం : పీఏసీఎస్ సొసైటీలు జాతీయ బ్యాంకులకు దీటుగా సేవలందించాలని డీసీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అధిక మొత్తంలో అందజేస్తూ ప్రజల మన్నలను పొందాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.డీసీఓను పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ వెంకట్ రెడ్డి, సీఈఓ జయేందర్, సిబ్బంది వీరస్వామి, ప్రశాంత్, స్వాతి, కిష్టయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భువనగిరిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొందరు ఫేజ్ 1,2,3లో వివరాలు నమోదు చేసుకున్నారని, వారు మళ్లీ నమోదు చేసుకోవల్సిన అవసరం లేదన్నారు. అభ్యర్థులు ఆప్షికేషన్ ప్రింటెడ్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఈ నెల 20 నుంచి 23వ తేదీ మధ్యలో ఆయా కళాశాలల్లో హాజరుకావాలని పేర్కొన్నారు.

డీసీసీబీకి ఉత్తమ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సీఈఓ మదన్‌మోహన్

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా లిమిటెడ్(సిబిల్) కంపెనీ ప్రతినిధులు శ్రుకవారం హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందజేశారు. సిబిల్ స్కోరు ప్రకారం పొరపాట్లు జరగకుడా సరళమైన రీతితో రుణాలు మంజూరు చేస్తున్నందున డీసీసీబీ సీఈఓ మదన్‌మోహన్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఉద్యోగుల సమష్టి సహకారంతో అవార్డు సాధించామని సీఈఓ పేర్కొన్నారు.

జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలి

భువనగిరి : హైదరాబాద్‌లో అక్టోబర్ 1న రాజ్యాంగం మరియు ప్రజలు అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరి కోర్టు ఆవరణలో సెమినార్ పోస్టర్ ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు సీసా శ్రీనివాస్, బొల్లేపల్లి కుమార్, ఆకుల ఆంజనేయులు, హరినాథ్, విద్యాసాగర్, జంగారెడ్డి, రాంరెడ్డి, ఐలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జిట్టా..!

- నేడు ఎంపీ వెంకట్‌రెడ్డి సమక్షంలో చేరిక
- భువనగిరి అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న బాలకృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : తెలంగాణ ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి నేడు (శనివారం) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.శుక్రవారం ఆయన భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మూడు రోజుల క్రితం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. దీంతో జిట్టా కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారానికి తెరపడినట్టింది.శనివారం ఉదయం 7గంటలకు జిట్టా బాలకృష్ణారెడ్డి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డితో కలిసి 10 గంటలకు ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సాదాసీదాగా పార్టీ కండువా కప్పుకోనున్నారు. అలాగే ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ విజయభేరికి హాజరయ్యే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి ఎంపీ కోమటిరెడ్డి జిట్టాను పరిచయం చేయనున్నారు.

మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ

యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నా అధినేత కేసీఆర్ ఆలే నరేంద్రను పోటీలో దించారు. అయితే జనతా పార్టీనుంచి టికెట్ తెచ్చుకున్న జిట్టా నామినేషన్ వేశారు. అనంతరం కేసీఆర్ ఇచ్చిన హామీతో నరేంద్రకు మద్దతుగా ఆ ఎన్నికల్లో పనిచేశారు. ఆ ఎన్నికల్లో నరేంద్ర ఓడిపోయారు. 2009లో భువనగిరి నుంచి జిట్టా పోటీ చేయాలనుకున్నా టీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో ఆపార్టీని వీడారు. మహాకూటమి అభ్యర్థి ఎలిమినేటి ఉమామాధవరెడ్డిపై ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ద్వితీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. అనంతరం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తర్వాత వైఎస్సార్ మరణంతో ఆయన కాంగ్రెస్‌కు దూరమయ్యారు. 2014 అసెంబ్లీల ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.



హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలకృష్ణారెడ్డి

యువ తెలంగాణ పార్టీ ఏర్పాటు

యువ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి 2018లో భారతీయ జనతా పార్టీ మద్దతుతో భువనగిరి నుంచి మరోమారు ఎమ్మెల్యేగా బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. అయితే గత సంవత్సరం తాను స్థాపించిన యువత తెలంగాణ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. తదనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో జిట్టా బాలకృష్ణారెడ్డి బీజేపీకి కూడా దూరమయ్యారు. అయితే త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న జిట్టా బాలకృష్ణారెడ్డి మరోసారి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం కొంతకాలంగా పార్టీ నాయకత్వంతో జరుపుతున్న చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేయాలని భావిస్తున్న జిట్టాకు.. టికెట్ వస్తుందా.. రాదా త్వరలో తేలనుంది.

టికెట్ హామీ లభించిందా!

భువనగిరి నియోజకవర్గానికి చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ హామీ లభించిందా లేదా అన్న చర్చ జరుగుతోంది. కర్ణాటక తరహాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో రెండు అసెంబ్లీ సీట్లను బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌లను బీసీలకు కేటాయిస్తారన్న ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. దీంతో పలువురు బీసీ నేతలు టికెట్ కోసం పీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. కాగా కాంగ్రెస్ అధిష్ఠానంనుంచి హామీ లభించడం వల్లే జిట్టా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మరోవైపు ప్రచారం సాగుతోంది.

20న చేరనున్న వేముల వీరేశం

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ముందుగా అనుకున్న ప్రకారం ఈనెల 16 లేదా 17వ తేదీన ఆయన్ని చేర్చుకునేలా కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. అయితే 17న హైదరాబాద్‌లో కాంగ్రెస్ సభ ఉండటం, ఆ సభకు సోనియాగాంధీ హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాలతో హడావుడి ఎక్కువగా ఉండనుండటంతో ఆయన చేరిక వాయిదా వేయాలన్న ఆలోచనలో పడినట్లు తెలిసింది. ప్రస్తుతం కుదరకపోతే 20వ తేదీన వీరేశంను చేర్చుకునేలా పార్టీ పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. ఢిల్లీలో సోనియాగాంధీ సమక్షంలోనే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రశాంతంగా టెట్



భువనగిరి : జాగృతి సెంటర్ వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



భువనగిరి : అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న అధికారులు

- పేపర్–1కు 2,385, పేపర్ –2కు 2,557 మంది హాజరు
- ఆలస్యంగా వచ్చిన 20 మందికి అనుమతి నిరాకరణ

భువనగిరి : జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పేపర్–1కు 2,976 మంది అభ్యర్థులకు గాను 2,385 మంది (80.14శాతం)హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పేపర్–2 పరీక్షకు 2,822కి 2,557 మంది (90.61) హాజరయ్యారు.

సమయానికి ముందే కేంద్రాల్లోకి అనుమతి

నిమిషం నిబంధన ఉండటంతో అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని చోట్ల ఉదయం 9 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించగా మరికొన్ని సెంటర్లలో 9 గంటలకు ముందుగానే పంపించారు. భువనగిరిలోని జీనియస్ హైస్కూల్ వద్ద రెండు నిమిషాల ముందుగానే గేటు మూసివేయడంతో ఇదే సమయంలో వచ్చిన ఇద్దరు అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు. మొత్తం మీద ఆలస్యంగా వచ్చిన సుమారు 20 మంది అభ్యర్థులకు అధికారులు అనుమతి నిరాకరించారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి న్యూ డైమెన్షన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వసతులు కల్పించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా పలువురు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో పరీక్ష రాయడానికి వచ్చారు. తమ పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించి పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. వారు తిరిగివచ్చే వరకు చిన్నారుల ఆలనాపాలన వారి కుటుంబ సభ్యులే చూశారు.

పట్టణంలో కోలాహలం

టెట్ పరీక్ష కేంద్రాలన్నీ భువనగిరిలోనే ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు, వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులతో పట్టణంలో కోలాహలం నెలకొంది. హోటళ్లు, బస్టాండ్, ప్రయాణ ప్రాంగణాలు రద్దీగా మారాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు టెట్ అభ్యర్థులతో కిక్కిరిశాయి.



భువనగిరి : న్యూ డైమెన్షన్ స్కూల్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

భువనగిరి మీదుగా కిషన్‌రెడ్డి ర్యాలీ



భువనగిరి పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- ఘన స్వాగతం పలికిన శ్రేణులు
- అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి, యాదాద్రి : సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ నుంచి పరకాల వరకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చేపట్టిన బుల్లెట్ బైక్ ర్యాలీ జిల్లాలో హుషారుగా కొనసాగింది.సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన అమృతోత్సవంలో భాగంగా శుక్రవారం కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీ చేపట్టారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని ఎల్లమ్మ గుడి వద్ద పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి కిషన్‌రెడ్డి భువనగిరిలోని అమర వీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అలాగే జనసంఘ్ సీనియర్ నాయకులు చందా ఈశ్వర్‌గుప్తా, భిక్షపతిని శాలువాలు, పూలదండలో సన్మానించి వారికి నమస్కరించారు.

హెల్మెట్ ధరించి, బుల్లెట్ నడుపుతూ..

కిషన్‌రెడ్డి హెల్మెట్ ధరించి, బుల్లెట్ నడుపుతూ కేడర్‌తో కలిసి ర్యాలీగా వచ్చారు. భువనగిరి పట్టణం నుంచి కలెక్టరేట్, రాయగిరి, వంగపల్లి, ఆలేరు పట్టణం మీదుగా జిల్లా సరిహద్దు పెంబర్తి వరకు బైక్ ర్యాలీ సాగింది. రాయగిరి వద్ద ఆలేరు నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. కిషన్ రెడ్డికి స్వాగతం పలికిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, గూడూరు నారాయణరెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, దాసరి మల్లేషం, పాశం భాస్కర్, పడమటి జగన్ మోహన్‌రెడ్డి, పడాల శ్రీనివాస్, పల్లెపాటి సత్యనారాయణ, నర్లనర్సింగరావు, చిరిగే శ్రీనివాస్, మాయ దశరథ, చందామహేందర్ గుప్తా, జనగాం నర్సింహచారి, మహమూద్, బడుగు జహంగీర్ తదితరులు ఉన్నారు. కాగా ర్యాలీలో బీజేపీ, బీజేవైఎం, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జనసంఘ్ నేతలను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో శ్యాంసుందర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు

కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు ప్రాధాన్యం



జెండా ఆవిష్కరిస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ లోనే మహిళలకు ప్రాధాన్యం దక్కుతుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి మహిళ కృషి చేయాలని కోరారు. అఖిలభారత మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం భువనగిరిలోని ప్రిన్స్ కార్నర్‌లో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజుల, స్వరూప, దీప, సృజన, శ్రీలత, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యలకు మస్తు డిమాండ్

- ఉత్సవ నిర్వాహకులకు కలిసొచ్చిన ఎన్నికలు
- గత ఏడాది కంటే రెట్టింపు విక్రయాలు
- మట్టి విగ్రహాలపై అంతంతమాత్రంగానే ఆసక్తి
- ఇళ్లలో పూజించడానికే ప్రాధాన్యం

సాక్షి,యాదాద్రి : వినాయక విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సమయం రెండు రోజులే ఉండడంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో యువత సందడి చేస్తోంది. కరోనా కారణంగా గత రెండు, మూడు సంవత్సరాలుగా అంతంత మాత్రంగానే విగ్రహాలు నెలకొల్పారు. ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ సమితులు సిద్ధమయ్యాయి. దీనికి తోడు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడం ఉత్సవ నిర్వాహకులకు కలిసొచ్చింది. ఆశావహులు, అభ్యర్థులు పెద్ద ఎత్తున విగ్రహాలు ఇప్పిస్తున్నారు. మొత్తంగా గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో వినాయక విగ్రహాల అమ్మకాలు ఉన్నట్లు తయారీదారులు చెబుతున్నారు. అయితే మట్టి వినాయకులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇళ్లలో ఏర్పాటు చేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు.

గత ఏడాది ఏర్పాటు చేసిన విగ్రహాలు ఇలా..

జిల్లాలో గత ఏడాది 2,265 వినాయకులను ఏర్పాటు చేశారు. అత్యధికంగా మున్సిపాలిటీల్లో 815 విగ్రహాలు ప్రతిష్ఠించారు. భువనగిరిలో 157, చౌటుప్పల్ 164, యాదగిరిగుట్ట 206, భూదాన్‌పోచంపల్లి 126, ఆలేరు 77, మోత్కూరులో 85 చొప్పున ప్రతిష్ఠించారు. మండలాల్లో సుమారు 1,450 విగ్రహాలు వెలిశాయి. ఈసారి విగ్రహాల ఏర్పాటు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.



చౌటుప్పల్‌లోని తయారీ కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా గణపయ్యలు

జోరుగా అమ్మకాలు

గత సంవత్సరం వ్యాపారుల వద్ద చిన్న, పెద్ద విగ్రహాలు 4,850 వరకు అమ్ముడుపోయాయి. ఈ సారి శుక్రవారం సాయంత్రం వరకు 3,500 విగ్రహాలకు పైగా విక్రయాలు జరిగినట్లు తయారీదారులు, వ్యాపారులు చెబుతున్నారు. ఉత్సవాలు ప్రారంభం కావడానికి మరో రెండు రోజులు సమయం ఉన్నందున సుమారు 6వేలు అమ్ముడుపోనున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే ఇందులో అత్యధిక శాతం రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలే ఉన్నాయి.

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చొరవతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2వేల మట్టి వినాయక విగ్రహాలను జిల్లాలో పంపిణీ చేయనున్నారు. మండలానికి 100 చొప్పున పంపిణీ చేస్తారు. ఎంపీడీఓల కార్యాలయాల్లో విగ్రహాల పంపిణీ ఉంటుందని జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య తెలిపారు.

ఎన్నికల వేళ.. చందాల సేకరణ

అన్ని వర్గాల ప్రజలు ఎన్నికలను అదునుగా తీసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు, బీఆర్ఎస్ అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున చందాలు సేకరిస్తున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



గత ఏడాది 100 పెద్ద విగ్రహాలు తయారు చేసి విక్రయించాం. ప్రస్తుతం అమ్మకాలు బాగానే ఉన్నాయి. పండుగ మరో రెండు రోజులు ఉన్నందున ఇంకా పెరిగే అవకాశం ఉంది. ధరలు గత ఏడాది మాదిరిగానే నిర్ణయించాం. మట్టి విగ్రహాలు తయారు చేయలేదు. –సత్యనారాయణ, విగ్రహాల తయారీదారుడు, భువనగిరి

మట్టి వినాయకులను పూజిద్దాం



పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించాం. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 17వ తేదీన విగ్రహాలను పంపిణీ చేస్తాం. మట్టి విగ్రహాల కోసం సెల్ నంబర్ 84988 27636ను సంప్రదించాలి. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. –గూడూరు నారాయణరెడ్డి, బీజేపీ నాయకుడు

ఎన్నికల విధులకు సిద్ధం కావాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి : ఎన్నికల విధులకు సిబ్బంది సన్నద్ధం కావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ సందర్భంగా, పోలింగ్ అనంతరం వివిధ స్థాయిల్లో విధులు నిర్వహించవలసి ఉంటుందని, ఎన్నికల కమిషన్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధుల పర్యవేక్షణకు 62 రూట్లలో 73 మంది సెక్టార్ అధికారులు, 62 మంది పోలీసు సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సెక్టార్ అధికారులు పోలింగ్‌కు ముందు వారం రోజుల నుంచి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా వ్యవహరింపబడతారని తెలిపారు. ఒక సెక్టార్ పరిధిలో 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. పోలింగ్ ముందు పోలింగ్ లొకేషన్లు, ఓటర్లు, వల్నరబిలిటీ మ్యాపింగ్, పోలింగ్ తర్వాత బాధ్యతలు ఉంటాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు ఉండేలా పరిశీలించాలన్నారు. నూతన పోలింగ్ కేంద్రాలపై విస్తత ప్రచారం కల్పించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక వ్యక్తుల గుర్తింపు, పోలింగ్ రోజు ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా, అధిక శాతం పోలింగ్ జరిగేలా కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెక్టార్ పరిధిలోని అధికారులు, బూత్ లెవల్ అధికారుల ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, ఈఆర్‌ఓలు, ఎంపీడీఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

క్లుప్తంగా

నేడు ఓరుగంటి రాములు సంతాప సభ

- హాజరుకానున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ


ఓరుగంటి రాములు (ఫైల్)

నల్లగొండ టూటౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సంతాప సభ శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరు కానున్నట్లు ఓరుగంటి రాములు కుటుంబ సభ్యులు తెలిపారు.

కాపర్ వైరు చోరీ

మునగాల: గుర్తుతెలియని వ్యక్తులు మునగాల శివారులో ఎన్‌ఎస్పీ ప్రధాన గేట్ల బేరింగ్‌లలో ఉన్న కాపర్ వైరును గురువారం రాత్రి చోరీ చేశారు. ఎన్‌ఎస్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఎడమకాలువ వద్ద ముక్త్యాల బ్రాంచి కాలువపై ఏర్పాటు చేసిన గేట్లపైన అమర్చిన రెండు పెద్ద సైజు బేరింగులను ఊడదీసి సుమారు రూ.రెండు లక్షల విలువ గల కాపర్ వైరును అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఎన్‌ఎస్పీ సిబ్బంది శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇదే ఎడమకాలువపై 15రోజుల క్రితం మునగాల శివారులో ఉన్న ఎస్కేప్ తలుపులకు సంబంధించిన నాలుగు బేరింగ్‌లలోని కాపర్‌వైర్ చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని అంచనా. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

విద్యార్థిని గాయపర్చిన ఉపాధ్యాయుడు


గాయపడిన సిరాజ్

తుంగతుర్తి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు గాయపరిచాడు. తుంగతుర్తిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కోదాడకు చెందిన షేక్ సిరాజ్ ఆరవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో గురువారం నైట్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుడు శుక్రవారం ఉదయం విద్యార్థులను నిద్రలేపే క్రమంలో సిరాజ్ తలపై ఇనుప చువ్వతో కొట్టాడు. దీంతో విద్యార్థి తలకు గాయమైంది. తోటి ఉపాధ్యాయులు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఉమారెడ్డికి తెలిపి విద్యార్థిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రిన్సిపాల్ ఉమారెడ్డి వివరణ కోరగా.. ఈ సంఘటనపై గురుకుల పాఠశాల ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో అధికారుల విచారణ


హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, ఏసీఎంఓ డివి నాయక్ విచారణ జరిపారు. హాస్టల్ విద్యార్థినులను తరగతుల వారీగా పిలిచి అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అపెండెక్స్‌తో ఒకరికి కడుపు నొప్పి రాగానే మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురైనట్లు రాజ్‌కుమార్ తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. త్వరలో హాస్టళ్లలో ఏఎన్‌ఎం అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. వారి వెంట హాస్టల్ వార్డెన్ అహల్య తదితరులున్నారు.

- ఆలస్యంగా అభ్యర్థులు.. అనుమతి నిరాకరణ


భువనగిరి మదర్ థెరిస్సా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి తాళం వేయడంతో గేటు బయటే నిల్చున్న అభ్యర్థులు


భువనగిరిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

- పరీక్ష కేంద్రం ఎదుట కిటకిట


భువనగిరి పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం ఎదుట వేచి ఉన్న అభ్యర్థులు

యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఫోర్‌మెన్ సస్పెన్షన్

మిర్యాలగూడ : దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రవితేజపై సస్పెన్షన్ వేటు వేస్తూ టీఎస్ జెన్‌కో చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి ఎ.ముత్యంరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రవితేజ శ్రీశైలం ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రంలో పని చేస్తుండగా సహచర ఉద్యోగులతోపాటు ఉన్నతాధికారులతో అనుచితంగా వ్యవహరించినందున ఇక్కడికీ బదిలీపై వచ్చారు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు నివేదిక ఆధారంగా ఉద్యోగం నుంచి రవితేజను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విధులు ముగించుకుని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం
- మరో టీచర్‌కు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం


ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులు

సూర్యాపేట రూరల్ : విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కారు రూపంలో మృత్యువు కబళించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట మండల పరిధిలోని ఎర్కారం గ్రామ సమీపంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అర్వపల్లి మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన సైరెడ్డి మల్లారెడ్డి (55) ఉక్కు వెంకన్న అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. రోజువారీగా ఒకే బైక్‌పై అర్వపల్లిలోని పాఠశాలకు వెళ్లి తిరిగి సూర్యాపేట వస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాల నుంచి సూర్యాపేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సూర్యాపేట–జనగాం రహదారిపై ఎర్కారం గ్రామ సమీపంలోని రేఖ్యా నాయక్ తండా వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మల్లారెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

భువనగిరి : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి మారుతిదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని హన్మాన్‌వాడకు చెందిన రేపాక నాగరాజు, తన భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నాడు. నాగరాజు వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కవిత తరచూ ఫోన్లో మాట్లాడుతుండడంతో మరొకరితో సఖ్యతగా మెలుగుతోందని నాగరాజు అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే 2019వ సంవత్సరంలో పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో తగాదా పెట్టుకున్నాడు. మద్యం మత్తులోనే బండరాయితో మోది కవితను హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నాగరాజుకు జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్షణ పడేలా కృషి చేసిన సీఐ సురేందర్, సిబ్బంది దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌లను అభినందించారు.

దాడి కేసులో ఐదేళ్ల జైలు

గుండాల : దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భువనగిరి అడిషనల్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన ఆశబోయిన రామచంద్రు, ఆశబోయిన మల్లేష్‌లు అన్నదమ్ములు. వీరు 2016వ సంవత్సరం జూలై 12న వ్యవసాయ బావి వద్ద తగాదా పడ్డారు. అనంతరం తమ్ముడు మల్లేష్ తీవ్ర ఆవేశంతో రామచంద్రు ఇంటి మీదికి వెళ్లి సోదరుడిపై గొడ్డలితో దాడి చేశాడు. మరుసటి రోజు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఏఎస్‌జే జడ్జి దశరథ రామయ్య నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.స్వామి, ఎస్ఐ యాకన్న, కానిస్టేబుల్ మధుకర్‌ను డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ శివరాంరెడ్డి అభినందించారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో విగతజీవుడై..

- ఆత్మహత్యగా పోలీసుల ప్రాథమిక నిర్ధారణ


పరుశరామ్ (ఫైల్)

రాజాపేట : అదృశ్యమైన వ్యక్తి వ్యవసాయ బావిలో విగతజీవుడై కనిపించాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, మరుకుక్ మండలం, పాములపర్తి గ్రామానికి చెందిన సాధుల లావణ్య తన భర్త పరుశరామ్ (35)తో కలిసి ఇటీవల రాఖీ పండుగకు రాజాపేట మండలంలోని సింగారంలో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. పరుశరామ్ అనారోగ్యానికి గురికావడంతో కొద్ది రోజులుగా అక్కడే ఉంటోంది. ఈ నెల 10వ తేదీన పరుశరామ్ అత్తింటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో లావణ్య మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి సింగారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీయించిన పోలీసులు చనిపోయిన వ్యక్తి పరుశరామ్‌గా అతడి కుటుంబ సభ్యుల ద్వారా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరుశరామ్‌కు డిపోకల్లు తాగే అలవాటు ఉందని, అది ఇక్కడ లభించకపోవడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కట్టుకున్నోడే కాలయముడు

- వీడిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ
- క్షణికావేశం, కుటుంబ కలహాలతోనే ఘాతుకం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్

మర్రిగూడ : మర్రిగూడ మండలం అజ్జిలాపురంలో ఇటీవల వెలుగుచూసిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాలు, క్షణికావేశంతో భర్తే ఆమెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అరెస్ట్ చేసిన నిందితుడిని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్ఐ రంగారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మర్రిగూడ మండలం కమ్మగూడేనికి చెందిన సుష్మిత, అజ్జిలాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రేమించుకుని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. సుష్మిత ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. దంపతుల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 10వ తేదీన రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన శ్రీకాంత్ దిండుతో సుష్మితను అదిమిపట్టి ఊపిరి ఆడనీయకుండా చేశాడు. అనంతరం మాల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత సుష్మిత మృతదేహాన్ని మర్రిగూడ ఆస్పత్రికి తీసుకొచ్చి అనారోగ్య కారణాలతో మృతిచెందినట్లు చిత్రీకరించాడు. మృతురాలి సోదరి శ్రీకాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. కుటుంబ కలహాలు, క్షణికావేశంలోనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన దేవరకొండ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

మర్రిగూడ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన దామెర అభిలాష్(35) కొంతకాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున అభిలాష్ మృతిచెందాడు. అభిలాష్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన రిటైర్డ్ టీచర్ మృతి

నకిరేకల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందాడు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన వద్ది లక్ష్మీనారాయణ(65) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి విరమణ పొందారు. లక్ష్మీనారాయణ నాలుగు నెలల క్రితం బైక్‌పై నకిరేకల్ నుంచి చందుపట్ల గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో చీమలగడ్డ ఫ్లై ఓవర్ కింద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధీర్ తెలిపారు.

రైలు నుంచి పడి మహిళ మృతి

భువనగిరి: భువనగిరి మండల పరిధిలో శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నాజీరా బీబీషేక్(30) భర్త సికింద్రాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. బీబీషేక్ తన ఇద్దరు పిల్లలతో కలిసి హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఫలక్‌నూమా రైలులో ప్రయాణం చేస్తోంది. ఈక్రమంలో నందనం–అనాజీపురం గ్రామాల మధ్య ఉదయం 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారీ పడి మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.

చీరలను అపహరిస్తూ చిక్కిన కి‘లేడీ’


సీసీ ఫుటేజీలో రికార్డయిన చీరల చోరీ దృశ్యం

భూదాన్‌పోచంపల్లి : గుట్టుచప్పుడు కాకుండా చీరలను అపహరించిన మహిళను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితుడు ధనుంజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సుష్మ మ్యాచింగ్ సెంటర్‌కు వచ్చిన గుర్తు తెలియని మహిళ చీరలు కావాలని చూపించమని కోరింది. ఆమెకు చీరలు చూపిస్తుండగానే గిరాకీ రావడంతో యజమాని వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని మహిళ రెండు చీరలను దొంగలించి బయటికి వెళ్లిపోయింది. కొద్దీ దూరం వచ్చి లోదుస్తుల్లో దాచిన చీరలను బయటికి తీసి కవర్‌లో వేస్తుండగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. గషాపులో ఉన్న సీసీ కెమెరాలో సీసీ ఫుటేజీని పరిశీలించగా అందులో చీరలు దొంగిలిస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన షాపు యజమాని ఆమెకోసం వెతుకుతుండగా స్థానిక మార్కండేయ దేవాలయం వద్ద కన్పించింది. పట్టుకొని ప్రశ్నించగా అమె పొంతనలేని సమాధానాలు చెప్పింది. దాంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే పోలీసుల విచారణలో పట్టుబడిన మహిళ పేరు చేకూరి సునిత అని, తనది దిల్‌సుఖ్‌నగర్ అని చెబుతుంది. ఉదయం నుంచి చీరలు కావాలని, జాకెట్లు కుడుతారా అని పలు షాపుల్లో తిరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం పట్టణ కేంద్రంలోని ఓ షాపులో చీరలు దొంగతనం కేసులో ఈమె పాత్ర ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బొమ్మలరామారం : ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

బొమ్మలరామారం : దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ యంజాల కళ భర్త సత్యనారయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఇంటిని వదిలి వేయాల్సి రావడంతో 20 రోజులుగా సర్పంచ్ కళ అత్తవారి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. పాత ఇంటి వైపు శుక్రవారం వెళ్లి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలోని బట్టలు ఇతర వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు అందులోని 3 తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటన పరిశీలించి, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం మేడారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెమిలితోక సోడమ్మ గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి సోడమ్మ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితురాలి నిద్రలోంచి లేచి కేకలు వేయడంతో దుండగుడు కనిపించకుండాపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ..

- చికిత్స పొందుతూ మృతి

చింతపల్లి : పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన జంగిటి ఇందిరమ్మ (35) భర్త రామ్మోహన్ ఇద్దరు కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వారికున్న ప్లాటు (ఖాళీ స్థలం)ను కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన బంధువులకు విక్రయించారు. ప్లాట్ విషయమై ఇరు కుటుంబాల మధ్య నెల రోజుల కిందట తగాదా చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఇందిరమ్మ ఇంట్లో ఉన్న వరి చేను కలుపుతీత మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఇందిరమ్మ మృతికి బంధువులే కారణమని ఆరోపిస్తూ శుక్రవారం మృతదేహాన్ని వారి ఇంట్లో వేసి ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీశ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ ఆందోళనకారులు న్యాయం కావాలని భీష్మించారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది. మృతురాలి భర్త రామ్మోహన్ ఈ విషయమై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు..

- సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్


ప్రమాదస్థలంలో ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ట్రాలీ


కేతేపల్లి: ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన జాతీయ రహదారిపై కేతేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కేతేపల్లిలోని మూసీ గ్యాంగ్ క్వార్టర్స్ సమీపంలోకి చేరుకోగానే ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. బస్సు ఏ మాత్రం ముందుకెళ్లినా రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంటలో బోల్తా కొట్టేది. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన తర్వాత బస్సు అక్కడే నిలిచి పోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని కేతేపల్లి పోలీసులు తెలిపారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు


రాజగోపాలరావు మండల వ్యవసాయ అధికారి


పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు



నడిగూడెం : వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలపై కూడా ఈ మధ్యకాలంలో రసాయన మందుల వాడకం గణనీయంగా పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందులను ఆశ్రయిస్తున్నారు. పంట కాలంలో ఆరు నుంచి పదిసార్లు రసాయన మందులను పిచికారీ చేయడం ఆందోళనకరం. వాడే పద్ధతి తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం రసాయన మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు చెబుతున్న జాగ్రత్తలు ఆయన మాటల్లోనే.. రైతులు రసాయన మందుల పిచికారీని తేలికగా తీసుకుంటున్నారు. అదుపు తప్పితే పురుగుకు కాదు మనిషికి ప్రాణాపాయమని గుర్తించడంలేదు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయనాలను వాడుతున్నారు. పిచికారీ సమయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. మందులు కలిపే సమయంలో ఎటువంటి తొడుగులు ఉపయోగించకుండా చేతితో లేదా కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పిచికారీ చేసిన తర్వాత భోజనాలు, నీళ్ల తాగడం, పొగతాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యం నీటి నిల్వకు వాడుకుంటున్నారు.

ఇవి తప్పనిసరి..

- పిచికారీ ముందు వ్యక్తి తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా శిరస్త్రాణం లాంటిది తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్ల తాగడం, బీడీ, సిగరెట్ లాంటివి, పొగపీల్చడం తినడం వంటివి చేయరాదు.
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసుకున్న తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన ఉండాలి.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు నుంచి మూడు కలిపి పిచికారీ చేయడం చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

- పిచికారీ సమయంలో రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్లిపోతుంది. ప్రాథమిక చికిత్సకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. అత్యవసర చికిత్సయే శరణ్యమవుతుంది. రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.